క్లుప్తంగా

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన


హిల్‌కాలనీలోని మొదటి వార్డులో వేస్తున్న సీసీరోడ్డు

నాగార్జునసాగర్ : ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో నందికొండ మున్సిపాలిటీలో చేపడుతున్న సీసీ రోడ్ల పనులకు గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ స్థానిక సిబ్బంది, మాజీ కౌన్సిలర్లతో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.25లక్షలతో 500 మీటర్ల సీసీ రోడ్డును 4వార్డులలో వేయనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మంగ్తనాయక్, ఈర్ల రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


పరీక్ష సామగ్రితో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

నాగార్జునసాగర్ : హిల్‌కాలనీ, పైలాన్ కాలనీలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు మహారాజ్ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బద్రి మాట్లాడారు. పేబ్యాక్ టూ సొసైటీ అనే నినాదంతో పేద విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్లారావు, వీరబాబు, శ్రీనివాస్, నకుల్‌రావు, శశిధర్, మోహన్, ప్రసాద్, నాగరాజు, గోపాల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శేషు, అనసూయ, ఉపాధ్యాయులు రాజబాబు, నాగపద్మ, సుధారాణి, శ్రీదేవి, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


లక్ష్మయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన బాషం లక్ష్మయ్య, యల్లాపురం గ్రామానికి చెందిన మండల గోవిందు మాతృమూర్తి మండల సైదమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి గురువారం వారి వారి నివాసానికి వెళ్లి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు అల్లి పెద్దిరాజు, కూన్‌రెడ్డి లింగారెడ్డి, సత్యంరెడ్డి, దుర్గారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జలేందర్‌రెడ్డి, కొండలు, ఆంజనేయులు, మునసయ్య, రాంరెడ్డి, శంకర్, గుండెబోయిన అంజయ్య, బాషం వెంకటేశ్వర్లు, రామలింగయ్య, గురువయ్య, సైదులు తదితరులు ఉన్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం


బొడ్రాయికి పాలాభిషేకం చేస్తున్న అర్చకుడు

గుర్రంపోడు : మండలంలోని పాల్వాయి గ్రామంలో గురువారం బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. వెంకటేశ్వర ఆలయం, కనకదుర్గ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు.

ఇన్‌స్పైర్ అవార్డు స్కీమ్‌కు ఎంపిక

గుర్రంపోడు : ఇన్‌స్పైర్ అవార్డు స్కీమ్ 2024-25కు డిపార్ట్‌మెంటల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రకటించిన జాబితాలో మండలంలోని పాల్వాయి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికై నట్లు హెచ్‌ఎం ఎం. విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు పంపించగా నలుగురు విద్యార్థులు డి. అనూష, టి.సాధ్విక, శ్రీలత, వి.సాయిభవాని ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా గైడ్ టీచర్లు పి. శ్రీనివాసులు, వై. రమణ, విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు.

నేటి నుంచి సాగర్‌మాత ఉత్సవాలు


తిరునాళ్ల సందర్భంగా ముస్తాబైన సాగర్‌మాత మందిరాలు


మేరీమాత విగ్రహం


సాగర్‌మాత మందిరంలో ఉన్న జపమాల క్షేత్రం

- విద్యుత్ దీపాలతో ముస్తాబైన మందిరాలు
- తిరునాళ్లకు ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- మూడు రోజుల పాటు కొనసాగనున్న మహోత్సవాలు

నాగార్జునసాగర్: సర్వమతాల సంగమంగా కృష్ణా నది తీరాన నాగార్జున సాగర్ ఒడిలో వెలుగొందుతున్న సాగర్‌మాత మందిరం వార్షిక మహోత్సవాలకు ముస్తాబయ్యాయి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. మేరీమాతే సాగర్‌మాత పేరుతో క్రైస్తవులతో పాటు హిందువులు, ముస్లింలు నీరాజనాలు అందుకుంటోంది. దేశంలోనే భారతీయ సంప్రదాయ రీతుల్లో నిర్మించిన తొలి క్రైస్తవ మందిరంగా దీన్ని చెబుతారు. ఇక్కడ అన్నిరకాల మొక్కులు పూర్తిగా హిందూ సంప్రదాయ పద్ధతిలో కొనసాగుతాయి. 1977 అక్టోబర్ 10న నిర్మించబడిన ఈ మందిరంలోని జపమాల క్షేత్రం ఏసుక్రీస్తు జననం నుంచి మరణం వరకు ఆయన జీవిత చరిత్ర తెలియజేస్తుంది. గతేడాది సాగర్‌మాత దేవాలయంపై, ఆలయంలో ఏర్పాటు చేసిన దేవదూతల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ సందర్భంగా ఇక్కడ తిరునాళ్లు జరగడం ప్రత్యేకతను సంతరించుకుంటోంది.

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

7వ తేదీ ఉదయం 5:30గంటల నుంచి 9:30 వరకు విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాల సాగర్, గురుశ్రీ జోసఫ్ తంబి అన్నెం ఆధ్వర్యంలో దివ్య బలిపూజలు, జపమాల, స్తుతి ఆరాధనలు ఉంటాయి. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం, 2గంటలకు వాక్య పరిచర్య, స్వస్థతా ప్రార్థనలు ఉంటాయి. సాయంత్రం 5:30గంటలకు గురుశ్రీ పత్తిపాటి మరియదాసు నేతృత్వంలో దివ్యబలిపూజలు జరుగుతాయి. రాత్రి 7:30గంటలకు కొవ్వొత్తులతో తేరు ప్రదక్షిణ, 8గంటలకు ఏసు చరిత్ర బుర్రకథ, రాత్రి 9గంటలకు ధనవంతుడు బీదలాజరు బైబిల్ నాటకం నిర్వహించనున్నారు.

8వ తేదీ ఉదయం 5గంటల నుంచి 8 గంటల వరకు గురుశ్రీ చిన్నాబత్తిని కిరణ్‌కుమార్, తుమ్మా కరుణాకరరెడ్డి, గురుశ్రీ పామిశెట్టి బాలస్వామి, గురుశ్రీ ఆర్.రాజు ఆధ్వర్యంలో వేర్వేరుగా దివ్య బలిపూజలు చేస్తారు. 9:30 గంటలకు జపమాల, స్తుతిఆరాధన, వాక్యపరిచర్య, 11:30గంటలకు గురుశ్రీ అల్లం చిన్నశౌరెడ్డి ఆధ్వర్యంలో దివ్యబలిపూజలు ఉంటాయి. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం, 2గంటల నుంచి సాయంత్రం 5:30గంటల వరకు నెల్లూరు సహవారస పీఠాధిపతులు డాక్టర్ పల్లి అంథోని, గురుశ్రీ కసిరెడ్డి జోసఫ్‌రెడ్డి బృందంచే సమష్టి దివ్యబలిపూజలు ఉంటాయి. రాత్రి 7.30గంటల నుంచి 9గంటలకు తేరు ప్రదక్షిణ, సాగర్‌మాత మహిమలు బుర్రకథ, సాంస్కృతిక కార్యక్రమాలు, శిలువధారి బైబిల్ నాటకం ప్రదర్శనలు ఉంటాయి.

9వ తేదీ ఉదయం 5గంటల నుంచి 8 గంటల వరకు విచారణ గురువులు గురుశ్రీ చాట్ల కస్పార్, పెట్ల గురుశ్రీ మర్రి అనిల్, గురుశ్రీ మార్నేని దిలీప్, గురుశ్రీ ఏరువ బాలశౌరెడ్డి ఆధ్వర్యంలో దివ్య బలిపూజలు కొనసాగుతాయి. ఉదయం 10:30 గంటలకు గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగయ్యచే సమష్టి దివ్యపూజ ఉంటుంది. గురుశ్రీ పామిశెట్టి థామస్ బృందంచే గానం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం, 3గంటలకు కోలాట, బ్యాండ్‌మేళం ప్రదర్శన, సాయంత్రం 6గంటలకు సాగర్‌మాత రథోత్సవం ప్రధానమైంది. రాత్రి 9గంటలకు తప్పిపోయిన కుమారుడు బైబిల్ నాటక ప్రదర్శన ఉంటుంది.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: దేవరకొండ డివిజన్‌లో వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి డివిజన్ పరిధిలో తాగునీరు, ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్, ఆర్ అండ్ ఆర్ భూ సేకరణ అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవరకొండ పట్టణంతో పాటు అన్ని గ్రామాలకు సరిపడా తాగునీటిని సరఫరా చేసేలా మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీరాజ్, విద్యుత్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మండలాల వారీగా తాగునీటి డిమాండ్, ప్రస్తుతం చేస్తున్న తాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ వచ్చే జూన్ వరకు ఎలాంటి తాగునీటి సమస్య రాకుండా చూడాలని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో అవసరమైతే అద్దె బోర్ల ద్వారా ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. నక్కలగండి ప్రాజెక్టు కింద ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వలేదని, దీనిపై మరోసారి విచారణ జరిపి న్యాయం చేయాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరగా పది రోజుల్లో విచారించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఇన్‌చార్జి ఆర్డీఓ శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల ఆస్తులను పరిరక్షించాలి



సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ నియోజకవర్గంలో హిందూ దేవాలయాల ఆస్తులను పరిరక్షించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు కోరారు. ఈమేరకు గురువారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతిపత్రంఅందజేశారు. పట్టణంలోని హౌజింగ్ బోర్డులో గల ఎస్‌పీ ఫంక్షన్ హాల్ వెనుక భాగంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని మసీదు నిర్మించుకుంటున్నారని, అదేవిధంగా శ్రీనివాస్ థియేటర్ పక్కన గల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించారని, అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని ఆయా భూములను కాపాడాలని వినతిపత్రంలో కోరారు. హిందూ దేవాలయాలకు చెందిన వ్యవసాయ భూములు, సముదాయలు, ఇతర ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని, సర్వే చేయించి కాపాడాలన్నారు. ఆలయాల ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని హిందూ దేవాలయాల అభివృద్ధికి ఖర్చు చేయాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి గంజి సుధాకర్, నాయకులు రాపర్తి శ్రీనివాస్, రమేష్, బి.సంపత్, బి.నవతేజ్ తదితరులు ఉన్నారు.

రైతు సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి


రైతులకు సభ్యత్వం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ అర్బన్ : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని యాద్గార్‌పల్లి, తాళ్లగడ్డలో రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండు లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు కాలేదని, రైతులకు రైతు భరోసా జమ కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం రబీ పంట ఆశాజనకంగా లేదని పంటల బీమా పథకం ఉంటే రైతుకు లాభం చేకూరేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎర్రబోతు పద్మ, కట్టా మాధవరెడ్డి, బంటు గురువయ్య, కాకాని సైదులు, శ్రీనివాస్, రామాచారి, వెంకటయ్య, మట్టయ్య, వెంకటేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

06ఎంఎల్‌జి 51 మిర్యాలగూడ అర్బన్ : రైతు సంఘం సభ్యత్వాలు అందజేస్తున్న నాయకులు

రైతు సంఘం సభ్యత్వ నమోదు

మిర్యాలగూడ : దామరచర్ల మండలం నర్సాపురం గ్రామంలో గురువారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మిర్చికి గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి కనకయ్య, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి లింగానాయక్, ఎల్లమ్మ, చెంప్ల, పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

హాలియా : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, సంస్కృతం పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 189 మంది విద్యార్థులకు గాను 181 మంది పరీక్షకు హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. అదే విధంగా కేజీబీవీలో 164 మంది విద్యార్థులకు గాను 164 మంది పరీక్షకు హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ లింగస్వామి తెలిపారు. పరీక్ష కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి తనిఖీ చేశారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

దేవరకొండ : చెత్త సేకరణకు వచ్చే మున్సిపల్ వాహనాలకు పట్టణ ప్రజలు తడి, పొడిచెత్త వేర్వేరుగా అందించాలని దేవరకొండ మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, పర్యావరణ ఇంజనీర్ సక్రునాయక్ అన్నారు. గురువారం పట్టణంలో పారిశుద్ధ్య కార్మికులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రతి రోజు పట్టణం నుంచి సేకరించే చెత్తను తడి, పొడిచెత్త రూపంలో సేకరించాలని సూచించారు. కంపోస్టు తయారీకి పొడిచెత్త ఏ విధంగా ఉపకరిస్తుందో కార్మికులకు వివరించారు. సమావేశంలో పారిశుద్ధ్య కార్మికులు, తదితరులున్నారు.

రోడ్డు విస్తరణకు కట్టడాల తొలగింపు


సాగర్ రోడ్డులో జేసీబీతో కట్టడాలను తొలగింపజేస్తున్న అధికారులు

మిర్యాలగూడ టౌన్ : జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారి (162) విస్తరణలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలో హైవే అధికారులు గతంలో మార్కింగ్ పెట్టిన పాయింట్ వరకు వివిధ కట్టడాలను తొలగిస్తున్నారు. హైవే, మున్సిపల్, పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో గురువారం తొలగింపు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల వరకు ఉండాలని, గతంలోనే మార్కింగ్ ఇచ్చామన్నారు. మార్కింగ్ గీసినా తొలగించకపోవడంతో తామే స్వయంగా తొలగిస్తున్నామని పేర్కొన్నారు. కొంత మంది షాపుల నిర్వాహకులు తాము తొలగిస్తామని అనడంతో తొలగింపును నిలిపివేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ వెంకన్న, టీపీఎస్ అంజయ్యలతో పాటు హైవే అధికారులు, పోలీసులు తదితరులున్నారు.

బీజేపీ గెలుపు సంబరాలు


చింతపల్లిలో బాణాసంచాలు పేలుస్తున్న నాయకులు


మిర్యాలగూడలో స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మిర్యాలగూడలో బీజేపీ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రేపాల పురుషోత్తంరెడ్డి, పెద్దబోయిన వెంకటరమణ, బంటు సైదులు, సత్యప్రసాద్, రమేష్, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, తల్లం అశోక్, సోములు, వేణు, లక్ష్మారెడ్డి, నక్క రవి, రవికుమార్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

చింతపల్లి : తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలకు గాను రెండింటిలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడంతో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ గెలుపుకు సహకరించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకుల కుక్కుడుపు రామకృష్ణ, ధరణిపతి రమణారావు, వెన్నం శేఖర్, బొడ్డు మహేష్, కుందేళ్ల చెన్నయ్య, నాల్ల శివకుమార్, మేకల నర్సింహ, గజ్జి అభినవ్, రమేష్, రాజు, లక్ష్మిపతి పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ప్రభుత్వ, అటవీ భూములకు సంబంధించి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పిస్తామంటూ ఎవరైన మోసానికి పాల్పడితే వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ అనీల్ అన్నారు. కొంతమంది వ్యక్తులు దళారీ ముఠాగా ఏర్పడి మండలంలోని అటవీ, ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాలు సృష్టిస్తున్నారని వస్తున్న వార్తల నేపథ్యంలో గురువారం తహసీల్దార్ అనీల్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మండలంలో ప్రభుత్వ భూముల సర్వే పూర్తి అయ్యిందని అన్నారు. కాస్తు కబ్జాలో ఉన్న వారిని గుర్తించి, సంబంధిత గ్రామపంచాయతీల నోటీస్ బోర్డులో అర్హులైన రైతుల పేర్లు ప్రకటించినట్లు తెలిపారు. అర్హులైన వారందరికీ త్వరలోనే పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తామన్నారు. ఈ క్రమంలోనే కొంతమంది వ్యక్తులు పట్టాలు ఇప్పిస్తామని రైతులను మోసం చేసే అవకాశం ఉందని, అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


నాయకునితండాలో ఉపాధ్యాయులతో విద్యార్థులు


కురుమేడు పాఠశాలలో...

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని నాయకునితండాలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా, ఉపాధ్యాయులుగా ఒక్కరోజు విధులను నిర్వర్తించి తమలో ఉన్న ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక దస్తులను ధరించి పలువురి మన్ననలు పొందారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరిక అంజిబాబు, ఉపాధ్యాయులు తావుర్యా నాయక్, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : మండల పరిధిలోని కుర్మేడు ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చిన్నవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రసాద్‌కు ఉత్తమ ఐఐటీ ఫిజిక్స్ ఉపాధ్యాయ అవార్డు


అవార్డు స్వీకరిస్తున్న ప్రసాద్

కొండమల్లేపల్లి : ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ ఆధ్వర్యంలో 2024-25సంవత్సరంలో నిర్వహించిన ఐఐటీ విభాగ పరీక్షల్లో మండల కేంద్రంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ 7వతరగతి విద్యార్థి ఎం.అర్జున్ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. అదే విధంగా పాఠశాలకు చెందిన ఫిజిక్స్ టీచర్ జి.ప్రసాద్‌కు గురువారం బ్రిలియంట్ ఒలంపియాడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అంథోని రామకృష్ణ, ప్రముఖ సీనియర్ జర్నలిస్టు మల్లె రమేష్ బహుమతులు ప్రదానం చేశారు.

మసీదు కమిటీని కొనసాగించాలి

- కమిటీ రద్దుపై స్టే ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు


కోర్టు ఉత్తర్వులను ముస్లిం వెల్ఫేర్ సొసైటీకి ఇస్తున్న కమిటీ అధ్యక్షుడు మహిమూద్ అలీ

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని మసీద్ సహాయ మిరాళం కమిటీని రద్దు చేయకుండా యధాతథంగా కొనసాగించాలని తెలంగాణ హైకోర్టు స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ఈ స్టే ఉత్తర్వులను ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ చావూస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆ కమిటీ అధ్యక్షుడు మహిమూద్ అలీ గురువారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు వ్యక్తులు..కలెక్టర్, సబ్ కలెక్టర్, వక్ఫ్‌బోర్డుకు తప్పుడు ఫిర్యాదులు చేశారన్నారు. దీనివల్ల కమిటీ పూర్వపరాలు తెలుసుకోకుండా అధికారులు పాత కమిటీని రద్దు చేసినట్లు మసీద్‌కు నోటీసులను అంటించారన్నారు. వక్ఫ్‌బోర్డు బైలా ప్రకారం బోర్డు మీటింగ్ జరిగిన తర్వాతే కమిటీని తొలగించాలన్న, నూతన కమిటీని నియమించాలన్నా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంపై తాను కోర్టును ఆశ్రయించడంతో యధాతథంగా కమిటీని కొనసాగిస్తూ స్టే ఆర్డర్ జారీ చేసిందన్నారు. ఈ సమావేశంలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ చావూస్, కైసర్, జాహంగీర్, మున్నాన్, నవాబ్జీన్, యూసుఫ్, షరీఫ్, బాబుజాని పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి పనిచేయాలి


శిక్షణలో పాల్గొన్న మేనేజర్, సిబ్బంది

దేవరకొండ : ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి సిబ్బంది పనిచేయాలని దేవరకొండ డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు అన్నారు. పదిరోజులుగా డిపోలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, అద్దెబస్సు డైవర్లు, కంట్రోలర్లకు సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించిన పవర్ ప్రోగ్రాం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదిరోజులుగా సిబ్బందికి ప్రయాణికుల పట్ల ఉండాల్సిన పద్ధతులు, విధివిధానాలపై పవర్ ప్రోగ్రాంలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో ఏడీఎం పడాల సైదులు, దీప్‌లాల్, నారాయణ, తదితరులున్నారు.

కనీస వేతనం నిర్ణయించాలని వినతి

నల్లగొండ టౌన్: షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాల జీఓను సవరించి రూ.26వేల వేతనంగా నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా కలెక్టరేట్ ఏఓకు ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో కోటి 20లక్షల మంది కార్మికులకు వర్తించే షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాల జీఓలు 2012 నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే వాటిని సవరించి కనీస వేతనాన్ని నిర్ణయించాలన్నారు. ఆయన వెంట చింతపల్లి బయ్యన్న, పోలె సత్యనారాయణ, ముత్యాలు, బొంగర్ల మల్లయ్య, నోముల యాదయ్య తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి


శిక్షణలో పాల్గొన్న మేనేజర్, సిబ్బంది

తిప్పర్తి: వచ్చే వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. గురువారం తిప్పర్తి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవికాలంలో తాగునీటి సమస్యలు ఉన్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధిహామీ పథకం పనులు ప్రారంభించి కూలీల సంఖ్య పెంచాలన్నారు. మార్చి చివరి నాటికి ఇంటి పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ జానయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగభవానీ పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనంలో మొక్కలు దగ్ధం


దగ్ధమైన పల్లెప్రకృతి వనంలోని మొక్కలు

కొండమల్లేపల్లి : మండలంలోని ఆంగోతుతండా గ్రామపంచాయతీలో గల పల్లెప్రకృతి వనంలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పువేయడంతో మొక్కలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం సాయంత్రం బీడీ తాగి రోడ్డు పక్కన పడివేయడంతో ఎండుగడ్డి కారణంగా మంటలు వ్యాపించి మొక్కలు దగ్ధమయ్యాయని తెలిపారు.

ప్రారంభమైన ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు

కొండమల్లేపల్లి : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 263మంది విద్యార్థులకు గాను 255మంది హాజరయ్యారు. శ్రీ క్రాంతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 171మంది విద్యార్థులకు గాను 170మంది హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహకులు తెలిపారు.